క్లుప్తంగా

ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకుందాం

సీతమ్మధార : ప్రజలకు అన్ని విధాలా సేవలందిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం కాకుండా రక్షించుకోవాలని సీఎఫ్‌టీయూఐ మహిళలు పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పడిన నాటి నుండి ఇప్పటి వరకు లక్షలాది మందికి ఉపాధి కల్పించడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ప్రజలకు అండగా నిలుస్తున్నాయన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు అమ్మేయాలని చూడడం అవివేకమన్నారు. ఈ కార్యక్రమంలో పద్మ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

మహారాణిపేట: భీమిలిపట్నం మండలంలో సింగనబందలో తమ స్థలానికి సంబంధించిన రికార్డ్స్‌ల్లో ఇతరులు పేర్లు తొలగించి న్యాయం చేయాలని పలువురు రైతులు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సింగనబంధ, లక్ష్మీపురం, మజ్జిపేట, దాకమర్రి, అల్లుపేట రైతులు, సిపిఎం కార్యకర్తలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని ఆవాల నరసయ్య, ఆవాల ముత్యాలు కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బి.గంగారావు, ఇతర నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌పై అవగాహన

జగదాంబ: ట్రాఫిక్‌పై వన్‌టౌన్ పోలీసులు అవగాహన చేపట్టారు. సోమవారం జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్ జంక్షన్ వద్ద ఎస్ఐ భాస్కరరావు వాహన చోదకులకు ట్రాఫిక్‌లో ఏవిధంగా వాహనాలు నడపాలో అవగాహన కల్పించారు. ట్రిబుల్ డ్రైవింగ్ చేయకూడదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ఈ సందర్భంగా పోలీసులు చలానాలు వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలు సేవలపై డీఎంహెచ్‌వో సమీక్ష

మహారాణిపేట : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో సోమవారం డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. ఎన్‌సీడీ సీడీ సర్వేను నూరు శాతం అప్‌లోడ్ చేయాలని, మ్యాపింగ్ పూర్తి చేయాలని, ఆసుపత్రి రిజిస్ట్రేషన్ ఉండాలని, గర్భిణుల నమోదు, ఎనీమియా, సికిల్ సెల్ ఎనీమియా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని డీఎంహెచ్‌వో కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎల్‌బీఎస్‌హెచ్ దేవి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, ప్రోగ్రాం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టర్నర్ సత్రం ఖాళీ స్థలాలకు వేలం పాట

మహారాణిపేట : మెయిన్ రోడ్డులోని టర్నర్ సత్రంలో గల ఖాళీ స్థలానికి 11 సంవత్సరాల కాలానికి నెలవారీ అద్దె ప్రాతిపదికన సోమవారం ఉదయం 11 గంటలకు సీల్డ్ టెండరు, టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించారు. దేవదాయశాఖ ఉప కమిషనర్ ఎస్.సుజాత, సహాయ కమిషనర్ కె.శిరీషా ఆధ్వర్యంలో వేలం పాటలు జరిగాయి.19 మంది ప్రథమ ధరావతు చెల్లించి టెండర్లలో పాల్గొన్నారు. డీసీ కార్యాలయం సూపరింటెండెంట్ విజయకుమార్, టర్నర్ సత్రం కార్యనిర్వహణాధికారి ఎస్.ప్రసన్నలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ వసంతరావు పాల్గొన్నారు.

బాలుడ్ని పరామర్శించిన ఎమ్మెల్యే వాసుపల్లి



బాలుడ్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్: నోటి ఇన్ఫెక్షన్‌తో వారం రోజులుగా కేజీహెచ్ భావనగర్ వార్డులో చికిత్స పొందుతున్న మర్రిపాలెంకు చెందిన బాలుడు ఎస్.దినేష్ చరణ్‌ను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం పరామర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్‌తో మాట్లాడి మెరుగైన వైద్యం అందివ్వాలని కోరారు.

రహదారి సమస్య.. మళ్లీ మొదటికి

- 39వ వార్డు జనావాసాల నడుమ మళ్లీ తిరుగుతున్న భారీ వాహనాలు
- సమస్య పరిష్కారానికి సీఎంను కలుస్తామన్న స్థానికులు



ఆగని వాహనాల రాకపోకలు



రహదారికి అడ్డంగా నిలబడిన 39వ వార్డు మహిళలు

జగదాంబ: తమ ప్రాణాలు జీవీఎంసీ ఉన్నతాధికారులకు పట్టావా? అంటూ పాతనగరవాసులు మండిపడుతున్నారు. 39వ వార్డులో అనేక సంవత్సరాలుగా పోర్టు, ప్రజల మధ్య సాగుతున్న రహదారి సమస్య మేయర్ హరివెంకటకుమారి చొరవతో పరిష్కారం అయిందనుకున్న సమయంలో అది కాస్త మళ్లీ మొదటికొచ్చినట్లు అయింది. జీవీఎంసీ ఉన్నతాధికారి తీరుతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఈ వార్డులో పోర్టు గోడకు అటువైపు ఒక రహదారి ఉంది. అది పోర్టుకు సంబంధించినది. ఇటు వైపు రహదారి జీవీఎంసీకి చెందినది. అయితే పోర్టు అధికారులు వారి రహదారిని వదిలేసి జీవీఎంసీ రహదారిని ఉపయోగించుకోవాలని చూస్తున్నారు. దీంతో ఈ వైపు ఉన్న ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాల రాకపోకల వల్ల ఇళ్లు కూడా శిథిలమవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రజల ఒత్తిడి వల్ల జీవీఎంసీకి చెందిన రహదారిలో భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా ఐరన్‌పోల్స్ వేసి రహదారిని మూసివేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. కానీ రోజుల వ్యవధిలోనే తిరిగి మాట వెనక్కి తీసుకోవడంతో జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది రోడ్డుకు అడ్డంగా వేసిన ఐరన్‌పోల్స్ తీసేయడానికి ప్రయత్నిస్తున్నారు. సోమవారం పోలీసుల రక్షణతో వారు రావడంతో ప్రజలు అధికారుల ప్రయత్నాలను అడ్డుకున్నారు. ఎన్నో ఏళ్లుగా పడుతున్న బాధలకు తెరపడిందని, మళ్లీ ఆ నరకంలోకి తమను తోయొద్దని వారు రహదారిపై బైఠాయించారు.

జగనన్నను కలుస్తాం..

ఎన్నో ఏళ్ల తమ సమస్య పరిష్కారం కావాలని, లేని పక్షంలో వార్డు ప్రజలందరం ముఖ్యమంత్రి జగనన్నను కలుస్తాం అని స్థానికులు స్పష్టం చేశారు. ప్రజల బాధలు పట్టించుకోకుండా పోర్టుకు ఎందుకు సహకరిస్తున్నారో అర్థం కావడంలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల తీరుపై రాష్ట్ర మైనార్టీ, రాష్ట్ర బీసీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అలాగే అమరావతి వెళ్లి జగనన్నకు సమస్య నివేదిస్తామని తెలిపారు. అప్పటి వరకు ఒక్క వాహనాన్ని కూడా ఇటుగా రానివ్వబోమని జీవీఎంసీ 39వ వార్డు ప్రజలు స్పష్టం చేశారు.

సమస్యల పరిష్కారం కోరుతూ వినతి



కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

మహారాణిపేట : వివిధ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం స్పందనలో కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం సమర్పించారు. వెంకటేశ్వర మెట్ట ఎండోమెంటు సమస్య పరిష్కరించాలని, విశాఖ స్మార్ట్ సిటీ వైఎస్సార్ ఆటోనగర్‌కు సంబంధించి స్థలం ఏర్పాటు చేయాలని కోరారు. క్యాస్ట్ సర్టిఫికెట్లు, రెవెన్యూ సర్టిఫికెట్లు త్వరగా ప్రజలకు మంజూరు చేసి సహకరించాలన్నారు. కోడిపందాల వీధికి చెందిన ఎల్లాజీకి జైపూర్ లెగ్ కోసం సహాయం చేయాలని కోరారు. అలాగే కొంతమంది పిల్లలకు స్కూలు ఫీజులు తగ్గించేందుకు సిఫార్స్ చేశామని, అది అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఖాజావలి, జెర్రిపోతుల ప్రసాద్, బొడ్డేటి ప్రసాద్, వైజాగ్‌పటం క్లబ్ అసోసియేషన్ సభ్యులు రాజపాత్రుడు, ఆర్‌కే బీచ్ హాకర్స్ రమణ, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆటోనగర్‌కు శంకుస్థాపన చేయండి

జగదాంబ: రాజన్న ఆటోనగర్‌కు శంకుస్థాపన చేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్ మల్లికార్జున్‌కు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి రాజన్న ఆటోనగర్ మంజూరుపై వచ్చిన ఆర్డర్‌ను కలెక్టర్‌కు అందజేశారు. దీనిపై త్వరలోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో శంకుస్థాపన చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ తమ కార్యాలయానికి కూడా రాజన్న ఆటోనగర్ మంజూరు ఆర్డర్ వచ్చిందని, త్వరలోనే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజన్న ఆటోనగర్ ప్రెసిడెంట్ పటాన్ ఖాజావలీ తదితరులు పాల్గొన్నారు.

1450 సర్వే నంబర్ సమస్య పరిష్కారానికి కృషి

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై నివసిస్తున్న స్థానికులకు, దేవదాయ శాఖ మధ్య నెలకొన్న 1450 సమస్య పరిష్కారానికి త్వరలోనే కృషి చేస్తామని కలెక్టర్ మల్లికార్జున తెలియజేశారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చెప్పారు. సోమవారం ఆయన వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్‌తో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలసి మరొక సారి 1450 సర్వే నంబర్ సమస్యను వివరించారు. దీనిపై ఇప్పటికే దేవాదాయ శాఖ అధికారులకు లేఖ రాయడం జరిగిందని, వివరాలు తెలియజేయాలని ఆదేశించినట్టు వారికి కలెక్టర్ తెలియజేశారని పేర్కొన్నారు.

వాహన దగ్ధం.. ఆకతాయిల పనే



పూర్తిగా కాలిపోయిన వాహనం

అల్లిపురం: టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి 33వ వార్డు, కంఠంవారివీధిలో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని కొందకు వ్యక్తులు ఇంటి ముందు నిలిపిన ద్విచక్రవాహనానికి నిప్పు పెట్టారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంఠంవారివీధికి చెందిన గొర్లె లక్ష్మి ఒక ప్రైవేటు సంస్థలో పని చేస్తున్నారు. ఆమె తన వాహనాన్ని వారి ఇంటి ముందు స్థలం లేక బాయమ్మ జంక్షన్‌లో గల రోడ్డులో పార్క్ చేసుకుంటారు. గత రాత్రి కూడా అదే విధంగా పార్క్ చేసి ఇంటికి చేరుకున్నారు. రాత్రి 12 గంటల సమయంలో ఆమె వాహనం దగ్ధం అవుతుందని తెలుసుకుని వచ్చేటప్పటికి వాహనం పూర్తిగా కాలిపోయింది. ఇది ఎవరు చేశారో తెలియదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. టూటౌన్ పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ప్రాంతంలో గతంలో రెండు మార్లు వాహనాలు దగ్ధం చేసిన ఘటనలున్నాయి. ఇది మూడవసారి. గతంలోనే పోలీసులు కఠినంగా వ్యవహరిస్తే ఇలా జరిగేది కాదని స్థానికులంటున్నారు.

బీజేపీ అరాచకపాలన అంతమొందించాలి

దాబాగార్డెన్స్: కేంద్రంలో బీజేపీ అరాచక పాలనను అంతమొందించేందుకు పోరాటం ఉధృతం చేయాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు పిలుపునిచ్చారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన సీపీఎం విశాఖ జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గినా, మోదీ ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నరేంద్రకుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కుమార్ పాల్గొన్నారు.

అత్తారింటి వేధింపులపై మహిళ ఫిర్యాదు



కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న కేవీపీఎస్ కార్యకర్తలు

మహారాణిపేట : వరకట్న వేధింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఒక మహిళ స్పందనలో ఫిర్యాదు చేసింది. దీనిపై వన్‌టౌన్ పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట కుల వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసింది. నాలుగు నెలల నుంచి భర్త, అత్త వరకట్న వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపింది. ఈ విషయమై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇంత వరకు పోలీసుల నుంచి ఎటువంటి స్పందన రాలేదని తెలిపింది. అందుకే కేవీపీఎస్ సహకారంతో కలెక్టర్ ఆఫీసు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొంది. మూడు సంవత్సరాల నుంచి తన భర్త సంతోష్ వేరే అమ్మాయితో సంబంధం పెట్టుకుని తనను నిర్లక్ష్యం చేస్తున్నారని, తమ పిల్లలు తనకు పుట్టలేదని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు మాధవి తెలిపింది. రూ. 20 లక్షలు అదనపు కట్నం ఇస్తేనే తనను ఏలుకుంటానని, తన పిల్లలుగా గుర్తిస్తానని చెబుతున్నారని వివరించింది. తనను ఇంటి నుండి వెళ్లగొట్టారని చెప్పింది. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకుడు వై. రాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కర్రసాములో విశాఖ చిన్నారుల ప్రతిభ



కర్రసాము పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులు

దాబాగార్డెన్స్: కర్రసాము పోటీలో విశాఖ చిన్నారులు ప్రతిభ చూపారు. వారం రోజుల పాటు చెన్నై కోయింబత్తూరులో సిలంబమ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఎస్. శ్రీనివాసరావు వద్ద తర్ఫీదు పొందిన పలువురు విద్యార్థులు బంగారు, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. కె శ్రీనివాసరావు (బంగారు, వెండి), యు. అశ్వినికుమార్ (2 బంగారు పతకాలు), జి. అంకిత్ (బంగారు, సిల్వర్), కె. కుశ్వంత్‌కుమార్ (బంగారు), పి. ఉజ్వల్ (బంగారు), వి. రాజు (బంగారు, వెండి), వి. దివ్య అంజలి (సిల్వర్), ఆర్. హునార్ (2 వెండి పతకాలు), కె. లోకేష్ (సిల్వర్), కె. సుప్రియ (బ్రాంజ్), ఎస్. వినయ్ ఈశ్వర్ (2 బ్రాంజ్ మెడల్స్) సాధించారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

నిబంధనల ప్రకారం బదిలీలు చేయాలి



జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు వినతిపత్రం అందజేస్తున్న సత్తిబాబు

మహారాణిపేట : ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగుల బదిలీలు చేయాలని ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు కోరారు. సోమ వారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్రకు వినతిపత్రం సమర్పించారు. ఈ బదిలీల్లో వికలాంగులు, మానసిక వికలాంగులు, ప్రభుత్వం నిర్దేశించిన కొన్ని వ్యాధులు గల ఉద్యోగులు, భార్యాభర్తలను ఒకే చోట ఉంచాలని, వితంతు ఉద్యోగినులకు తగు ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కొత్తమ్మవారి పుట్టబంగారం పండగ

అల్లిపురం: అమ్మవారివీధి ప్రజల ఆరాధ్య దైవం కొత్తమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి పుట్ట బంగారం తీసుకువచ్చే కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి దేవాలయం నుంచి భక్తులు భాజాభజంత్రీలు, మందుగుండు సామగ్రితో తిరువీధిగా వైర్లెస్‌కాలనీలో గల శ్రీ రామాలయంలో గల సుబ్రమణ్యస్వామి దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం అక్కడ గల పుట్టకు పూజలు నిర్వహించి, పుట్టబంగారం తొడ్కొని తిరిగి మంగళవాయిద్యాల మధ్య అమ్మవారివీధి కొత్తమ్మవారి దేవాలయానికి చేరుకుని పుట్టబంగారాన్ని ఆలయంలో కొలువుతీర్చారు. కొత్తమ్మవారి ఉత్సవంలో భాగంగా ఆదివారం అర్ధరాత్రి నుంచి అమ్మవారి దేవాలయం నుంచి అమ్మవారి ఉజ్జుడి బండి అల్లిపురం గ్రామం అంతా తిప్పారు.

ఎలక్ట్రిక్ వాహనంపై జీవీఎంసీకి మేయర్



జీవీఎంసీకి ఎలక్ట్రిక్ వాహనంపై వచ్చిన మేయర్

దాబాగార్డెన్స్: స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపుకు మేయర్ హరివెంకటకుమారి ఎలక్ట్రిక్ వాహనంపై వచ్చారు. అనంతరం జీవీఎంసీకి చేరుకుని స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాలు పూర్తి చేసుకుని తిరిగి ఎలక్ట్రిక్ వాహనంలోనే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఉద్యోగులు, అధికారులు తమ సొంత వాహనాలు వదిలి ప్రజా రవాణాను ఉపయోగించుకోవాలన్నారు. వారంలో ఒక రోజు బస్సు, ఆటో, సైకిల్‌పైనే జీవీఎంసీకి ఉద్యోగులు చేరుకోవాలన్నారు.

బోధకాలుపై జాగ్రత్తలు తప్పనిసరి

జగదాంబ: బోధకాలు వ్యాధి పట్ల జాగ్రత్తలు తీసుకుంటే నివారించవచ్చునని కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. సోమవారం జీవీఎంసీ 39వ వార్డు వైఎస్ఆర్ అర్బన్ పబ్లిక్ హెల్త్ క్లినిక్‌లో బోధకాలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విల్లూరి మాట్లాడుతూ మొదటి స్టేజిలో జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధిని నివారించవచ్చన్నారు.

అటెన్షన్ ప్లీజ్

జాలరిపేట.. సమస్యల కోట



మురుగు చెంతనే పిల్లల ఆటాపాట



నివాసాల నడుమ పారుతున్న మురుగు

- మురుగు మధ్యే జీవనం
- దుర్వాసనతోనే సహవాసం
- వీరికి మెరుగైన జీవన ప్రమాణాలు ఎండమావేనా?

దాబాగార్డెన్స్: సమస్యల సుడిగుండంలో జాలారిపేట కొట్టుమిట్టాడుతోంది. సముద్రాన్నే నమ్ముకున్న వీరికి మురికి కూపాలే శాపంగా మారాయి. వారు నివసించే ప్రాంతాలు అపరిశుభ్రతకు చిరునామాల్లా ఉన్నాయి. తిండీ తిప్పలు అన్నీ అక్కడే వారికి. పిల్లలు ఆ మురుగులోనే ఆటపాటలతో గడిపేస్తున్నారు. దోమలు, ఈగలతో సహవారం చేస్తూ వ్యాధులకు గురవుతున్నారు. అందాల సాగరానికి కూతవేటు దూరంలో ఉండే తమ ప్రాంతం వైపు ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాలని.. తమ జీవన ప్రమాణాలు మెరుగుపరచాలని జాలరిపేట వాసులు అభ్యర్థిస్తున్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ప్రజారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం కురుపాం మార్కెట్, టౌన్‌హాల్‌రోడ్డు, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ రోడ్డు, కోటవీధి, పెరికివీధి, ఫిషింగ్‌హార్బర్, కొప్పులవీధి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు శానిటరీ కార్యదర్శులు పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీధుల్లో పారిశుధ్యం నిర్వహణ సరిగ్గా లేదని, కాలువలు, డ్రైన్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, రోడ్లను శుభ్రం చేసి, చెత్త పోగులు ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. పారిశుధ్య కార్మికులు ఉదయం 6 గంటల నుంచి వీధుల్లో ఉండాలని, క్లాప్ వాహనాలు నిర్ణీత సమయానికే ఇంటింటి చెత్త సేకరణకు వెళ్లేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుని కాలువల్లో వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వ్యాపించకుండా ఇప్పటి నుంచే ప్రజల్లో అవగాహన కల్పిస్తూ దోమల వృద్ధిని అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన రహదారుల్లో రాత్రి పారిశుధ్య పనులు సరిగ్గా నిర్వహణ జరగడం లేదని, ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలున్నాయని, వాటిని తొలగించాలన్నారు. పర్యటనలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఏఎంవోహెచ్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

అశాస్త్రీయ విద్యా విధానాలను విడనాడాలి

సీతమ్మధార : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అశాస్త్రీయ, మనువాద విధానాలను విడనాడాలని డీటీఎఫ్ జిల్లా కన్వీనర్ ఎ.ధర్మేంద్రరెడ్డి అన్నారు. సోమవారం డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అలాగే బాధిత మహిళా రెజ్లర్ల పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పాఠశాల విద్యా శాఖ ఉన్నతాధికారుల నియంతృత్వ పోకడల్ని వ్యతిరేకించాలన్నారు. పాఠ్యాంశాల సిలబస్ తగ్గింపు పేరుతో చరిత్ర వక్రీకరణకు పాల్పడుతున్నారని, ప్రఖ్యాత డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డీటీఎఫ్ బాధ్యులు సంధ్యారాణి, సాయిప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి జి.మధు, జిల్లా నాయకులు నానాజీరావు, రామారావు, పీడీఎస్‌వో జిల్లా బాధ్యులు భాస్కర్, ఫణీంద్ర, జిల్లా ఉపాధ్యక్షురాలు బుజ్జి, శివప్రసాద్, అంబేద్కర్, రాజేశ్వరి, ఉషారాణి, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

60 రోజుల పాటు చలివేంద్రం నిర్వహణ

సీతమ్మధార: ప్రతి ఏడాది ఎండా కాలంలో అరవై రోజుల పాటు చలివేంద్రం ఏర్పాటు చేస్తామని విశాఖపట్నం జిల్లా అసోసియేషన్ ఆఫ్ డెఫ్ సంస్థ ప్రతినిధి చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పది సంవత్సరాలుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని, వారానికి రెండు సార్లు మజ్జిక, ఒక రోజు ఓఆర్ఎస్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.సంతోష్‌కుమార్, పి.షణ్ముక తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

అల్లిపురం: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం అల్లిపురం గాంధీ బొమ్మ వద్ద మజ్జిగ చలివేంద్రం ప్రాంభించారు. క్లబ్ పూర్వ అధ్యక్షుడు సీమకుర్తి విఠల్‌కుమార్ సహకారంతో ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రాన్ని ఆయనతో పాటు క్లబ్ అధ్యక్షుడు డీవీఎస్ఎన్ రాజు, కార్యదర్శి బీవీఎల్ కుమార్, కోశాధికారి పీవీఎస్ఆర్ గుప్తా, ఉపాధ్యక్షుడు ఎస్.సుబ్రమణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాదచారులు, వాహన చోదకులకు మజ్జిగ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు విజయకుమార్, తాతాజీ, అమ్మాజీ, రమేష్, పెద్దబాబు పాల్గొన్నారు.

జగనన్నతోనే గ్రామ స్వరాజ్యం

జగదాంబ: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. సోమవారం వార్డులో సేవామిత్ర అవార్డులు పొందిన వారందరినీ సత్కరించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల ఏర్పాటును చూసి పక్క రాష్ట్రాలు కూడా ఇదే తరహా పథకాలు రూపొందించడం జగనన్న పారదర్శక పాలనకు అద్దం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ ఔదార్యం



ఆర్థిక సాయం అందజేస్తున్న కార్పొరేటర్ మేరీజోన్స్

దాబాగార్డెన్స్: రెల్లివీధికి చెందిన బంగారు సుబ్బారావు గత కొద్ది రోజులుగా కాలికి దెబ్బ తగిలి మంచాన పట్టాడు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా సోమవారం సుబ్బారావు ఇంటికి 36వ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు వెళ్లి రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో కుందేటి సుధాకర్, శ్రీధర్, మీసాల గౌతం, చిరంజీవి, రమణి, రాజు, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సంగీత విభావరి

దాబాగార్డెన్స్: ఈ నెల 23న నటరత్న ఎన్టీఆర్, సూపర్ స్టార్ కృష్ణ చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు భూషణ్ బ్రదర్స్ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు బి.ఫణిభూషణ్ తెలిపారు. ఈ మేరకు సినీ సంగీత విభావరి పోస్టర్‌ను ప్రముఖ పారిశ్రామికవేత్త ముప్పాన వెంకట్రావు చేతుల మీదుగా తన చాంబర్లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫణిభూషణ్ రావు మాట్లాడుతూ ఎన్టీ రామారావు, కృష్ణ జయంతి రోజులు ఇదే నెలలో కావడమే కాకుండా భూషణ్ బ్రదర్స్ సంస్థ 31వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ద్వారకానగర్, పౌరగ్రంథాలయంలో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కళా సంస్థల గౌరవాధ్యక్షుడు కొణతాల రాజు తదితరులు పాల్గొన్నారు.